# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# మంచిపూజ

"ఈ రోజుకి అయింది నా పని" అంటూ లాప్ టాప్ మూసి ఇంటికి వెళ్ళడానికి తయారవుతున్నాడు సౌరభ్.

" ఓ, ఈ రోజు తొందరగా అయిందే! "అన్నాడు అశ్విన్.

"ఈ రోజు ఇంట్లో పూజ, వీలైతే తొందరగా రమ్మని చెప్పింది అమ్మ" అన్నాడు.

"ఓ, అవునా? మీ ఇంట్లో పూజలు బాగా చేస్తారు కదా?" అన్నాడు అశ్విన్.

" ముక్కోటి దేవతలు ఒక్కటైనారు" అని ఒక పాట బాగా ఇష్టంగా వినేవాడిని చిన్నప్పుడు, అలా అందరూ ఒక్కటైతే తప్ప ఈ పూజలు ఇలా సాగుతూనే ఉంటాయి. మా అమ్మకి చాలా నమ్మకాలు ఎక్కువ, ప్రతీ రోజూ ఏదైనా ఒక పూజ చెయ్యమన్నా కూడా రెడీ గా ఉంటాయి తన దగ్గర పూజలు " అన్నాడు సౌరభ్ కూడా నవ్వుతూ.

" నువ్వు చెప్పింది నిజమే, కానీ ఈ పండగలు, పూజలు ఎన్ని చేసినా ఇంకా మిగిలే ఉంటాయిలే మనకి. నువ్వేమో పెద్దగా దేవుడిని నమ్మినట్టు కనపడవు, మీ అమ్మగారేమో అంత రెలీజియస్. చిత్రం కదూ" అన్నాడు అశ్విన్.

" చిత్రం ఏముంది? ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. అమ్మ పెరిగిన వాతావరణం వేరు, పరిస్థితులు వేరు. అప్పటి నమ్మకాలు వేరు, మనవి వేరు కదా. అయినా మేమిద్దరం ఎప్పుడూ ఒకరినొకరు ప్రశ్నించుకోం, ఎవరి పద్ధతి వారిది అన్నట్టుగా ఉంటాము "అన్నాడు సౌరభ్.

"నేను కొద్దిగా పెద్దవాడినయినప్పటినించీ నాకు ఎప్పుడూ దేవుడిని చూస్తే నమస్కరించాలని గానీ, పూజ చెయ్యాలని గానీ అనిపించేది కాదు. నాన్న పోయినప్పటినించీ అమ్మా, అక్కా ఎప్పుడూ పూజలు చేసేవారు, అయినా సరే నాకెందుకో ఎప్పుడూ వాటిల్లో పాల్గొనాలని అనిపించేది కాదు. గొప్ప విషయమేమిటంటే అమ్మ కానీ, అక్క కానీ నన్నెప్పుడూ బలవంతపెట్టలేదు, నా అభిప్రాయాలను గౌరవించి ఊరుకునేవారు. ఎప్పుడో ఒక సారి తప్ప మా మధ్యన దీన్నిగురించి పెద్దగా చర్చలు జరగవు. " అన్నాడు సౌరభ్.

" ఓ అవునా? ఆంటీ నిజంగా గ్రేట్. లేకపోతే ఈ రోజుల్లో పెద్దవాళ్ళందరూ ఎప్పుడు చూసినా లెక్చర్లిచ్చి విసిగించేవారే కాని, పిల్లల అభిప్రాయాలని తమతో సమానంగా గౌరవించేవారెవరు? మా అమ్మైతే వీలున్నప్పుడల్లా క్లాస్ లు పీకుతూనే ఉంటుంది "అన్నాడు అశ్విన్ నవ్వుతూ.

" ఆల్రైట్, నేను వెళ్తాను ఇంక" అంటూ బయటకొచ్చాడు. లోకల్ ట్రెయిన్ పట్టుకుని ఇంటికి వెళ్ళాలి. భోజనం చెయ్యకుండా ఎదురు చూస్తూ ఉంటుంది అమ్మ. పూజ అయిందో, లేదో? అనుకున్నాడు తనలో తనే. వర్షాకాలం ఆకాశం ముసుగేసి కురవడానికి సిద్ధంగా ఉంది. పరుగులాంటి నడకతో స్టేషన్ వైపుకి నడుస్తున్నాడు. ఆఫీస్ కి దగ్గరలోని స్టేషన్ కి వెళ్ళి లోకల్ ట్రెయిన్ ఎక్కి ఇంటికి దగ్గరగా ఉన్న స్టేషన్ కి వెళతాడు. రోజూ తన బైక్ ని ఇంటి దగ్గర స్టేషన్ లో పొద్దున్నే పెట్టుకుంటాడు. సాయంత్రం ఇంటికి వెళ్ళేటప్పుడు అది ఎక్కి స్టేషన్ నించి ఇంటికి వెళ్తాడు.

స్టేషన్ దగ్గరకి వస్తూ ఉండగానే వర్షం మొదలయింది. పెద్ద పెద్ద సూదుల్లా పడసాగింది వర్షం. ముంబయి లో వానలు బాగా ఉధృతంగా పడతాయి. వర్షాకాలం మూడు నాలుగు నెలలు రోజూ పెద్ద పెద్ద వానలు పడుతూనే ఉంటాయి. రైలు పట్టాలమీదకి నీళ్ళు వచ్చేసి బాగా మునిగిపోతే తప్ప ఏదీ ఆగదు ఆ మహానగరంలో. ఇల్లూ వాకిలీ సరిగా ఉన్నవారికైతే పరవాలేదు కానీ ఎక్కువ సౌకర్యాలు లేని స్లంస్ లో ఉండేవారికైే దినదిన గండం గా ఉంటుంది.

" ఇంక ఎంతసేపు పడుతుందో ఏమిటో ఈ వాన? "అనుకుంటూ బాగ్ లోంచి గొడుగు తీసి వేసుకుని వడి వడిగా నడవడం మొదలు పెట్టాడు.

ట్రెయిన్ రెడీగా ఉంది, ఒక్క పరుగున వెళ్ళి ట్రెయిన్ ఎక్కాడు. గొడుగు మూసి చేతిలో పట్టుకున్నాడు. కంపార్ట్మెంట్ అంతా అప్పటికే తడిగా ఉంది, అందరి గొడుగుల్లోంచీ కారుతున్న నీళ్ళూ, తడి చెప్పులూ అవీ. 'దైనందిన జీవితపు పోరాటం ' అనుకున్నాడు. అతనికి తడి ట్రెయిన్ అంటే చిరాకు. అయినా తప్పదు. ఇంటికీ ఆఫీసుకీ ఉన్న దూరానికీ రోజూ బైక్ మీద వచ్చే వీలు లేదు. ప్రతీ రెండు మూడు నిమిషాలకో స్టేషన్ వస్తోంది. వర్షం బాగా పెద్దదయింది. అవటానికి ఆరే అయినా ఎనిమిది దాటినట్టనిపిస్తోంది. ఆకలేస్తోంది. బాగ్ లో బిస్కెట్లున్నాయి కానీ తీసే వీలు లేదు. విపరీతమైన రష్ ట్రెయిన్లో. వచ్చేనెల ఫస్ట్ క్లాస్ పాస్ కొనుక్కోవాలి. అప్పుడైనా కనీసం నిలబడటానికి స్థలం ఉంటుందేమో అనుకున్నాడు.

తనకి ముంబయితో విడదీయలేని అనుబంధం. ఎందుకో ఈ ఊరు వదిలి వెళ్ళడానికి ఇష్టమే ఉండదు. ఇక్కడే పుట్టారు తనూ, అక్కా. హఠాత్తుగా నాన్న పోయినప్పటినించీ అమ్మ తననీ, అక్క సురభినీ ఎంతో జాగ్రత్తగా పెంచింది. ప్రైవేట్ కంపెనీలలో చిన్న చిన్న ఉద్యోగాలు చేసింది, బట్టలు కుట్టింది. అమ్మమ్మ వాళ్ళు ఎప్పుడైనా చేసే చిన్న చిన్న సహాయాలు తప్పితే తామిద్దరినీ ఒక్కచేత్తో తనే పెద్దవాళ్ళని చేసింది. నానమ్మ, తాతగారు తమ చిన్నతనాన్నే పోయారు. అమ్మకి మొదట్నించీ దైవభక్తి ఎక్కువ. ఎప్పుడూ ఏవో పూజలూ, వ్రతాలూ చేస్తూనే ఉంటుంది. ఎవరేం చెప్పినా వెంటనే ఆ పూజ చేసేసేదాకా నిద్రపట్టదు అమ్మకి. ముఖ్యం తన పిల్లలకోసం ఏదైనా చెయ్యమంటే ఫస్ట్.

"ఎందుకమ్మా, కష్టపడి సంపాదించిన డబ్బు వీటిమీద ఖర్చు చేస్తావ్? " అంటాడు తను.

" ఏదో, తన సంతోషం తనది, నువ్వెందుకురా ఎప్పుడూ ఏదో ఒకటి అంటావ్?" అంటుంది అక్క.

"ఇవ్వాళేం పూజ పెట్టుకుందో?" అనుకుంటూ చుట్టూ చూడసాగాడు.

అప్పుడు వినపడింది అతను ఎదురు చూస్తున్న శబ్దం. టక్, టక్ మంటూ దూరంగా. సౌరభ్ ముఖంలో చిరాకు స్థానే చిరునవ్వు చోటుచేసుకుంది.

"బాబా" అంటూ పిలిచాడు ఆ శబ్దం దగ్గరపడటంతో.

"బేటా, వచ్చావా? ఈ రోజు తొందరగా వెళ్తున్నావే? పని అయిపోయిందా? లేక ఇంట్లో ఏదైనా పనా?" అన్నాడా వ్యక్తి. అతనికి అరవైఐదేళ్ళ వయసుంటుంది. పొట్టిగా ఉన్న పైజమా, దానిమీదకి తెల్లటి కుర్తా వేసుకున్నాడు. తెల్లటి గడ్డం, నెత్తిన లేస్ టోపీ. ముఖాన నల్ల కళ్ళ జోడు. ఒక చేతిలో కర్రా, మరొక చేతిలో తెల్లటి పెద్ద సంచీ.

వారిద్దరి సంభాషణా హిందీలో సాగుతోంది.

"బాగున్నావా , బాబా! పొద్దున్న కనిపించలేదు" అన్నాడు చిరునవ్వుతో.

" పొద్దున్న లేట్ గా నిద్రలేచాను బేటా, అందుకే రాలేకపోయాను. ఇదిగో నీకోసం ఉంచాను ఈ నాలుగూ.. కలర్ నాకు తెలియదు కదా! నువ్వు చూసుకో, బాగున్నాయా? " అన్నాడు చేతిలో కర్రతో కంపార్ట్మెంట్ ని తడుతూ..

" ఓ గ్రీన్, రెడ్.. నాకు చాలా ఇష్టం ఈ కలర్స్. థాంక్ యూ బాబా" అంటూ ఆ నాలుగు పౌచ్ లు తీసుకుని వంద రూపాయలు అతని చేతిలో పెట్టాడు.

" షుక్రియా బేటా" అన్నాడు అతను నవ్వుతూ.

చుట్టుపక్కల వారు వీళ్ళిద్దరినీ కొంచం చిత్రంగా చూస్తున్నారు.

" ఈ రోజు తొందరగా వెళ్తున్నావు బేటా, ఏమన్నా ఖుష్ ఖబర్ ఉందీ?" అని అడిగాడు అతను.

" అక్క పెళ్ళి చేద్దామని చూస్తోంది అమ్మ, అది కుదిరితే ఖుష్ ఖబరీ. అమ్మ పూజ చేస్తోంది, ఇద్దరూ తొందరగా రమ్మన్నారు, లక్కీగా పని కూడా అయిందిలే తొందరగానే ఈ రోజు" అన్నాడు సౌరభ్ తన స్టేషన్ దగ్గరకి వస్తూ ఉండడంతో దిగటానికి తయారవుతూ.

" అఛ్ఛీ బాత్ హై బేటా, అమ్మకి నమస్తే చెప్పు" అన్నాడు అతను..

" తప్పక చెప్తాను, నువ్వు జాగ్రత్తగా ఇంటికి వెళ్ళిపో" అన్నాడు సౌరభ్.

" ఊరూ కొత్త కాదు, చూపు లేనిదీ కొత్త కాదు, భయమేముంది? అన్నాడు అతను నవ్వుతూ..

"ఇంకోసారి ఆ మాటనకు బాబా, చూపు మాత్రమే లేదు నీకు, అన్నీ ఉన్నాయనుకున్న మాలాంటివారికెన్నో లేవు, వస్తాను. అమ్మ ఎదురు చూస్తూ ఉంటుంది. రేపు కలుద్దాం" అంటూ డోర్ దగ్గరకి బయలుదేరాడు.

" జాగ్రత్త బేటా" అని చెప్పాడు అతను వెనకనించి.

ఎవరికెవరో తెలియని, ఎవరికోసమూ మరొకరి దగ్గర సమయం లేని ఈ మహానగరంలో ఈ కుర్రాడు తనకెలా కలిసాడు? రోజూ విధిగా తన దగ్గర వస్తువులెందుకు కొంటాడు? అనుకుంటేనే అతనికి ఆశ్చర్యంగా ఉంటుంది. ఏం చేసుకుంటాడు ఇన్ని పౌచ్ లని? అడిగితే నవ్వేస్తాడు తప్ప సరి అయిన సమాధానం చెప్పడు.

" కావాలి బాబా! లేకపోతే ఎందుకు కొంటాను? "అని నవ్వేస్తాడు. నెలకి తన చేతిలోకి కనీసం మూడు వేలు వచ్చేలా చూస్తాడు. ఏవిటో ఈ అనుబంధం " అనుకున్నాడు అతను.

గబ గబా బైక్ దగ్గరకి నడిచి రెయిన్ కోట్ వేసుకుని బైక్ స్టార్ట్ చేశాడు. పది నిమిషాల్లో ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో అంతా హడావిడిగా ఉంది. అమ్మ, అక్కా వచ్చినవాళ్ళందరికీ తాంబూలాలు, అరటిపళ్ళూ అవి ఇస్తున్నారు. అదంతా అయ్యేసరికి మరొక అరగంట పట్టింది. అప్పుడు టీ తెచ్చింది అమ్మ.

టీ తాగి "ఇప్పుడే వస్తానమ్మా" అంటూ కిందకి వెళ్ళడానికి బయలుదేరాడు.

" మళ్ళీ కొన్నావా ఆ పౌచ్ లు? ఎందుకురా రోజూ వీటిమీద డబ్బులు తగలేస్తావు? అంది ఆవిడ చిరుకోపంగా. సౌరభ్ ఏమీ మాట్లాడలేదు.

" నిన్నే కదరా అడుగుతోంది అమ్మ, చెప్పచ్చుగా. క్రమం తప్పకుండా రోజూ నాలుగు కొంటావు. కనీసం వంద రూపాయలు రోజుకి " అంది అక్క సురభి.

" పిల్లలకిస్తానమ్మా, స్కూల్ కి తీసుకెళ్ళడానికి కావాలి కదా వాళ్ళకి" అన్నాడు.

" రోజూ ఎవరికిస్తావు? ఎందుకు రోజూ కొనడం?" అంది ఆవిడ.

మన చుట్టుపక్కల స్లంస్ లో ఉన్న చిన్నపిల్లలకిస్తానమ్మా. రోజూ నలుగిరికిచ్చినా ఇంకా ఎంత మందో ఉన్నారు. తమ వంతు ఎప్పుడు వస్తుందా? అని చూస్తూ ఉంటారు కూడా. మనకున్నదాంట్లో కొంత దానం చెయ్యాలి అని నువ్వే కదా ఎప్పుడూ అంటావు. ఇదీ అలాంటిదే అన్నాడు చిన్నగా నవ్వుతూ..

" అవుననుకో, కానీ ఇదేం దానం? చక్కగా ఎదైనా పనికి వచ్చేది చెయ్యచ్చుగా" అంది మెత్తగా.

" పనికిరాని దానమంటూ ఏదీ లేదమ్మా. అనువెరిగి చేసేది ఏదైనా మంచి దానమే. మంచిది అంటే నీ ఉద్దేశ్యంలో పూజలూ, దానికి సంబంధించిన దానాలూ మాత్రమే అంటే నేనేమీ చెప్పలేను. నేను చేసే ఈ పనికీ ఓ కారణముందమ్మా. ఇవి రోజూ నేను ఒక అతని దగ్గరే కొంటానమ్మా! అతను ఇవొక్కటే అమ్ముతాడు. ఇంకేదైనా అమ్మితే అవీ కొంటాను" అన్నాడు నవ్వుతూ.

" ఏమిటి అతని స్పెషాలిటీ?" అంది సురభి తమ్ముడిని ఏడిపిస్తూ..

" స్పెషాలిటీ అంటే ఉందక్కా, అతను పెద్దవాడు, పైగా అంధుడు. ఎవరూ లేని ఒంటరివాడు. కానీ ఎవరిమీదా ఆధరపడటం ఇష్టం లేని వాడు. అంతే కాదు తనకి వీలున్నంతలో ఎవరికైనా సహాయం చెయ్యాలనుకునేవాడు. అతను రోజూ నేను వెళ్ళే లోకల్ ట్రెయిన్ లో ఈ పెన్నులూ, పెన్సిళ్ళూ పెట్టుకునే చిన్న చిన్న సంచీలు అమ్ముతూ ఉంటాడు. నాకతనితో పరిచయం విచిత్రంగా జరిగింది అసలు.

" కాళ్ళూ చేతులూ శుభ్రంగా ఉన్నాయి, ఇలా అడుక్కు తినకపోతే చక్కగా ఏదైనా పని చేసుకుని బ్రతకచ్చు కదా" అని కోప్పడుతున్న ఒకతన్ని మధ్యలోనె ఆపి బాబా ఇలా అన్నాడు.

" అలా అనకండి సార్, మరో దారి లేకపోతేనే ఇలాంటి మార్గం ఎంచుకుంటారు తప్ప, కోరి ఎవరూ దేహీ అనాలని అనుకోరు. కనీసం నాలా ఈ పౌచ్ లైనా అమ్ముకుంటారు. ఆకలి మనిషితో ఎంత పనైనా చేయిస్తుంది. అది తీరే మార్గముంటే ఎవ్వరూ దేనికీ ఎవ్వరినీ యాచించదు. ఇదిగోరా, బేటా! ఈ వంద రూపాయలు తీకుకో, ముందేదైనా తిని ఆ తర్వాతేదైనా చిన్న పని చూసుకో, దొరకకపోతే రేపు నాకు చెప్పు, నీకూ ఏదైనా పని ఇప్పిస్తాను మా సేఠ్ తో చెప్పి" అన్నాడు.

అక్కడ ఉన్న వాళ్ళందరం అలాగే నిలబడి చూశామక్కా. అప్పుడే నాకర్థమైంది ఒక విషయం.

'ఫిష్ ఇవ్వకు, ఫిషింగ్ రాడ్ ఇవ్వు, ఫిష్ ఆహారాన్నిస్తుంది, ఫిషింగ్ రాడ్ జీవితాధారాన్ని ఇస్తుంది అన్నది ఇదివరకు విన్నదే ఇక్కడ ఫిష్ ఇచ్చాడు, ఫిషింగ్ రాడ్ కూడా ఇస్తున్నాడు. అప్పుడు గమనించానక్కా అతన్ని. కళ్ళు లేవు, అయినా అతను ఎప్పుడూ ఎవరినీ ఏదీ అడగడు. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ లో వేలకి వేలు పోసి వస్తువులు కొనుక్కునే వాళ్ళు తన దగ్గర కొనుక్కుంటారా? అన్న అనుమానం కూడ ఎప్పుడూ ఉన్నట్టుగా కనపడదు. అందుకే అతనికి వీలైనంత సహాయం చెయ్యలని ఆరోజే అనుకున్నాను. అదీకా అతనమ్మే వస్తువులు చిన్నపిల్లలకి ఉపయోగపడేవి కనక ఇది రెండు విధాలుగా ఉపయోగపడుతుందని కూడా అనిపించింది. నెలకు మూడు వేలు మనకిప్పుడు పెద్ద మొత్తం కాదమ్మా, అవి ఇలా రెండు రకాలుగా ఉపయోగ పడుతోంది, ఇంతకంటే మంచి పూజ నాకేమీ కనిపించలేదమ్మా " అన్నాడు చెప్పులు వేసుకుంటూ.

Click here to share your comments on this story